ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటాలి

- ఘనంగా జాతీయ పతాకావిష్కరణ
- ఆకట్టుకున్న 150 అడుగుల త్రివర్ణ పతాక ర్యాలీ

నందిగామ టౌన్: దేశం సుస్థిరమైన ప్రభుత్వ హయాంలో ఉందని, పటిష్టమైన నిర్ణయాలు తీసుకునే ప్రధాన మంత్రి ఉండటం దేశానికి వరమని ఆర్డీవో రవీంద్రరావు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక గాంధీ సెంటరులో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని చాటుకునేలా నడుచుకోవాలన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని, గాంధీ కన్న కలలను సాకారం చేసే దిశగా పయనిస్తున్నాయని కొనియాడారు. అనంతరం తేజ, దీక్ష కళాశాలలు, కాకతీయ, రామకృష్ణ, నారాయణ ఆంగ్లో వేదిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి 150 అడుగుల భారీ జెండాతో పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిపాటి లక్ష్మణరావు, మునగంటి కామేశ్వరరావు, గొటిక వెంకట అప్పారెడ్డి, తులసీకృష్ణ, కొత్త సాంబశివరావు, మురుమురు శివ, పలువురు నాయకులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


నందిగామ గాంధీ సెంటరులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ఆర్డీవో, నాయకులు

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

దేశ స్వాతంత్ర్య సముపార్జనకు అసువులు బాసిన అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుతామని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్య కళాశాల నుంచి గాంధీ సెంటరు వరకు త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరులు కన్న కలలను నేటి ప్రభుత్వాలు, నేతలు వంచిస్తున్నాయన్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయేతప్ప తగ్గటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపీ నాయక్, మాధవ్, కమల్, నరసింహ, అభిషేక్, వెంకటేష్, కాజు, ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, దామోదర్, శ్రీనివాస్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, తదితరులు

రేపు మాంసం విక్రయాలు బంద్

నందిగామ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాంసాహార విక్రయాలు చేయరాదని మున్సిపల్ ఇన్చార్జ్ కమిషనర్ ఫణి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో గొర్రె,, మేక, కోడి, పంది, తదితర మాంసాహార విక్రయదారులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విక్రయాలు నిలిపివేయాలన్నారు. మిలటరీ భోజన హోటళ్లు, కర్రీ పాయింట్లలో కూడా మాంసాహార కూరలు విక్రయించరాదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడి మానేసిన పిల్లలను గుర్తించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాలలో బడి మానేసిన (డ్రాప్ అవుట్స్) పిల్లలను విధిగా గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఐడీసీఎస్ కార్యాలయంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మంగళవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖాధికారులు ఈ నెల 31లోగా గ్రామాలలో బడి మానేసిన పిల్లల వివరాలను సేకరించాలన్నారు. ఇందుకు వార్డు ఎడ్యుకేషనల్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. గ్రామంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 100 రోజుల లక్ష్యాలు అమలయ్యేలా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల గ్రామ సభల్లో పనులను గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్చార్జి తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, ఎంఈవో–2 చిట్టిబాబు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

వీరులపాడు: మండల ఎంపీడీవోగా అరుంధతీదేవి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేసిన శివపార్వతి గుంటూరు జిల్లా రేపల్లెకు బదిలీ అయ్యారు. దీంతో ఆమె స్థానంలో అరుంధతీ దేవి ఎంపీడీవోగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నేడు హిందూ చైతన్య వేదిక ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పట్టణంలో బుధవారం హిందూ చైతన్యవేదిక, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంగళరావు, పట్టణ అధ్యక్షుడు సంకా భాస్కరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ముక్త్యాల బస్టాండ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందూ సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సులభరీతిలో బోధించాలి

పెద్దాపురం(వీరులపాడు): విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎంఈవో పాల్‌కెనడీ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యూపీ పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్ పంపిణీ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక పాలకేంద్రంలో మంగళవారం పాడి రైతులకు బోనస్ పంపిణీ చేశారు. కేంద్రంలో పాలు పోస్తున్న 96 మంది రైతులకు నాలుగు నెలలకు రూ.1,56,500 పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి రామనాథం, కార్యదర్శి సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నందిగామ టౌన్: మండలంలోని మునగచర్ల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఘంటా అనంతరావమ్మ (100) సోమవారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంతే కాకుండా గ్రామంలోనే పెద్ద వయస్కురాలిగా గ్రామస్తులకు సుపరిచితులు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శతాధిక వృద్ధురాలి మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మునేటినుంచి అక్రమంగా తెలంగాణకు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సతీష్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామంలోని మునేటి నుంచి తెలంగాణలోని వల్లభి, పెద్దమండవకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

వీరులపాడు: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. వీరులపాడులోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. నందిగామ పరిధిలో ఇసుక లోడ్ చేసుకున్న వాహనదారులు వారికి కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం వెళ్లాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రంగవల్లులతో గణితంపై అవగాహన



అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రంగవల్లులతో గణితంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులు రంగవల్లులతో గణితంలోని పాఠ్యాంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు గోవింద్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీదేవి, పుష్పవల్లి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: పేదల కడుపు నింపేందుకే మరలా అన్న క్యాంటీన్‌లు పునఃప్రారంభం అని ఎన్టీఆర్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం శ్రీరఘురాం అన్నారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని కమలా సెంటర్‌లో ఈనెల 15న ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ పునరుద్ధరణ పనులను మంగళవారం అధికారులు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు నెట్టెం శివరామ్‌తో కలిసి నెట్టెం శ్రీరఘురాం పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, నాయకులు కూరపాటి సైదులు, జంగా నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

200 మద్యం సీసాలు స్వాధీనం



జగ్గయ్యపేట: తెలంగాణ నుంచి అక్రమంగా ద్విచక్ర వాహనంలో మద్యం తీసుకువస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం కోదాడ నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకువస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో షేర్‌మహ్మద్‌పేట క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన తిమ్మసర్తి రాజు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో 200 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నందిగామ శివారు అనాసాగరానికి చెందిన పెద్దమళ్ల నరసింహారావు బెల్టుషాపు నిర్వహిస్తుండగా సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ విధానాలు అమలు చేయాలి

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ విధానాలు సమర్థవంతంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించటంతో పాటు, బడికి రాని పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. అనుమతులు వచ్చిన సొంత స్థలాలు, లేఅవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు తక్షణం పూర్తి చేయించాలన్నారు. ముఖ్యంగా పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ ద్వారా సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిహర్ష, హౌసింగ్ ఏఈ చిదంబేశ్వరరావు, ఎంఈఓ డి. రవీంద్ర, ఏపీఓ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కృష్ణచైతన్య, పక్కన ఎంపీడీఓ సాయిహర్ష

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 14 వరకు..

నందిగామ టౌన్: భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 16నుంచి సెప్టెంబరు 14వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ బాబు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ సచివాలయాల వద్ద ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు జరుగుతాయని చెప్పారు.

సదస్సుల వివరాలు..

ఈ నెల 16న పెద్దవరం, 17న తక్కెళ్లపాడు, 20న లింగాలపాడు, లచ్చపాలెం, 22న అడవిరావులపాడు, మునగచర్ల, 23న చందాపురం, కెకంద్రిక అగ్రహారం, 24న కేతవీరునిపాడు, 27న అంబారుపేట, 28న ఐతవరం, 29న కంచల, 30న పల్లగిరి, సత్యవరం, సెప్టెంబరు 3న రాఘవాపురం,4న గోళ్లమూడి, ఐదున సోమవరం, రుద్రవరం, 6న దాములూరు, కొణతమాత్మకూరు, 10న తొర్రగుడిపాడు, కొండూరు, 11న రామిరెడ్డిపల్లి, 12న జొన్నలగడ్డ, 13న మాగల్లు, 14న నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రిబ్కారాణి, ఆర్ఐ వేణుకుమారి, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

‘డ్రగ్స్ రహిత రాష్ట్రం’ అందరి బాధ్యత

వత్సవాయి: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ వత్సవాయి సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల పిల్లలతో డ్రగ్స్ నివారణలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. వత్సవాయి, లింగాల, మక్కపేట, పోలంపల్లి, కంభంపాడు, భీమవరం, మంగొల్లు, కన్నెవీడు, గోపినేనిపాలెం గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, వాటి వల్ల అనారోగ్యాల గురించి తెలిపారు. రానున్న యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అంగన్‌వాడీ, వైద్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న పాఠశాల విద్యార్థులు

నిందితులను అరెస్టు చేయకపోవడం శోచనీయం

మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడిచేసి ఐదు రోజులు గడుస్తున్నా నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం శోచనీయమని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నేత అల్లూరి భాస్కర్‌తో కలసి ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక చారిత్రక ఘట్టానికి ఆద్యుడు అయ్యారన్నారు. దీనిని ఓర్వలేక ఈ విగ్రహంపై ఆయన పేరును తొలగించడంతో పాటు లైటింగ్‌ను కూడా తొలగించారని ఆరోపించారు. దీనికి పూర్తిగా చంద్రబాబునాయుడే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆయన ప్రమేయం లేకుండా పచ్చమూకలు ఈ దాడికి ఎందుకు పాల్పడతాయని ప్రశ్నించారు. ఈ నెల 9న అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసి ఇప్పటికి 5 రోజులవుతున్నప్పటికీ ఇప్పటి వరకు నిందితులను గుర్తించి అరెస్ట్ చేయకపోవడం శోచనీయమన్నారు. తొలగించిన పేరును తిరిగి ఏర్పాటు చేయాలని, దుండగులు ఎవరైనా సరే పట్టుకొని వెంటనే శిక్షించాలని కోరారు. దీనిపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, అల్లూరి భాస్కర్

క్వారీ కార్మికులకు భద్రత కల్పించాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్

పరిటాల(కంచికచర్ల): కంకర క్వారీల్లో ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పరిటాల శివారు దొనబండలో మంగళవారం రాతి క్వారీలను పరిశీలించారు. కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కంచికచర్ల, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో 154 రాతి క్వారీలు ఉన్నాయని, ప్రస్తుతం 69 క్వారీలు నడుస్తున్నాయని తెలిపారు. అయితే మైనింగ్‌శాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తున్న క్వారీలు ఉన్నాయని ఆరోపించారు. ఈ క్వారీల్లో ఐదు వేల మందికి పైగా మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వచ్చి పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులతో క్వారీ యాజమాన్యం వెట్టి చాకిరీ చేయించుకుంటుందని, కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేకపోయిందన్నారు. క్వారీ నిర్వాహకుల లాభాపేక్ష కోసం కార్మికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారని ఆరోపించారు. క్వారీలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సేఫ్టీ మెజర్‌మెంట్స్ అమలు చేయలేని దుస్థితిలో క్వారీ యాజమాన్యం, మైనింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. క్వారీలో మృత్యువాత పడిన కుటుంబాలకు అరకొర పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి క్వారీలో పనిచేసే కార్మికులకు సేఫ్టీ మెజర్‌మెంట్స్ కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కే కల్యాణ్, జిల్లా కార్యదర్శి ఎం.మహేష్, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, దుర్గ, కామేశ్వరరావు, రాజారావు, బుజ్జి, వంశీ, శివ, కొండల రావు, ప్రకాషరావు, పార్వతి, బేబి, సరోజిని, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి.. కొణకంచి కీర్తి

- దేశంలోనే గ్రామస్థాయిలో తొలి కాంగ్రెస్ భవనం
- స్వాతంత్ర్య స్ఫూర్తిని కలిగించిన గ్రంథాలయం
- రేపు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో పశ్చిమ కృష్ణాలో మండలంలోని కొణకంచి గ్రామానికి గొప్ప చరిత్ర ఉంది. గ్రామం కేంద్రంగా జాతీయోద్యమం ఉధృతంగా జరిగింది. గ్రామానికి చెందిన ఎందరో స్వరాజ్యం కోసం బ్రిటీషు ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడి జైళ్లకు వెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకొని, ప్రాణాలను సైతం లెక్క చేయక పోరాడారు.


రిపబ్లిక్‌డే స్తూపం

గ్రామ స్థాయిలో తొలి కాంగ్రెస్ భవనం..

ఉద్యమాలకు నిలయం కొణకంచి గ్రామంలో దేశంలోనే తొలిసారి గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 2, 1942లో తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు దీనికి శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో దీనిని పూర్తి చేశారు. భవనానికి ఆంధ్రకేసరి భవనం అని నామకరణం చేశారు. భవన నిర్మాణానికి ప్రోత్సాహకంగా దేశ నేత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేకంగా ఒక సందేశం పంపించారు.


గ్రామంలో కాంగ్రెస్ భవనం

క్విట్ ఇండియా ఉద్యమంలో..

గ్రామానికి చెందిన అనుమోలు గోవిందశర్మ ఆధ్వర్యంలో 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో గ్రామం నుంచి 25 మంది యువకులు, ఒక మహిళ పాల్గొన్నారు. బ్రిటిషు వారిని వ్యతిరేకిస్తూ గ్రామోద్యోగులు షేక్ బికాసాహెబ్, షేక్ పకీర్‌అహ్మద్ తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. గ్రామ మునసబుగా ఉన్న కాకుమాను పిచ్చయ్య ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ జాతీయోద్యమంలో పాల్గొనాలని యువకులను ఎంతో ప్రోత్సహించారు. 1920–30 మధ్యలో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ఖద్దరు నిధికి గాంధీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. కొణకంచి అడ్డరోడ్డు వద్ద గ్రామస్తులు కొంత విరాళం మొత్తాన్ని ఆయనకు అందజేశారు.


స్వాతంత్ర్యోద్యమ విజయస్తూపం

చరిత్రకు సాక్ష్యాలుగా..

దేశానికి స్వాతంత్ర్యం రాగానే 1948లో గ్రామం మధ్యలో 46 అడుగుల విజయస్తూపం, 1950లో రిపబ్లిక్ డే చిహ్నంగా 18 అడుగుల స్థూపాన్ని నిర్మించారు.

స్ఫూర్తిని కలిగించిన గ్రంథాలయం..

గ్రామంలో ఏర్పాటు చేసిన బాలభక్త గ్రంథాలయం నాడు ప్రజల్లో ఎంతో చైతన్యం కలిగించింది. 1916, జులై 18న కొణకంచి చక్రధరరావు, పురుషోత్తమరావు, కాకుమాను పిచ్చయ్య, నకరికంటి వెంకయ్య, చిర్రావూరి వీరభద్రయ్య తదితరులు దీనిని ప్రారంభించారు. ప్రారంభంలో కాకుమాను పిచ్చయ్య, అయ్యదేవర లక్ష్మీనరసింహం అధ్యక్ష, కార్యదర్శులుగా గ్రంథాల సేకరణకు కృషి చేశారు. అనంతరం 1925లో రేపాల బుచ్చిరామయ్య శ్రేష్ఠి, అనుమోలు గోవిందశర్మ, వ్యవహరించారు. 1930లో గ్రంథాలయం తరుపున రేపాల బుచ్చిరామయ్యశ్రేష్ఠి సుజ్ఞానప్రద పత్రికను నడిపారు. ప్రజల్లో పత్రిక జాతీయోద్యమ భావాన్ని రేకెత్తించింది. అదే ఏడాది ఏప్రిల్ 9 నుంచి మూడు రోజుల పాటు గ్రంథాలయ 14వ వార్షికోత్సవం నిర్వహించారు.


బాలభక్త గ్రంథాలయం

గర్వంగా ఉంది



మా కుటుంబం నుంచి ముగ్గురు వ్యక్తులు స్వాతంత్రోద్యమంలో పాల్గొనటం గర్వంగా ఉంటుంది. మానాన్న, పెదనాన్నతో పాటు మేనత్త ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. గ్రామం నుంచి 26 మంది స్వాతంత్రోద్యమంలో గాంధీ పిలుపు మేరకు పాల్గొన్నారు. ఇప్పుడు గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు అందరూ మరణించారు. మాగ్రామంలో నాటి చిహ్నాలు మాత్రం ఉన్నాయి.

–కోయ శ్రీనివాసరావు, స్వాతంత్ర్య సమరయోధుల బంధువు

మానసిక రోగులను సేవా దృక్పథంతో చూడాలి

న్యాయమూర్తి శోభారాణి


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి

జగ్గయ్యపేట అర్బన్: మానసిక రోగులను సేవా దృక్పథంతో చూడాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జగ్గయ్య పేట మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి శోభారాణి మాట్లాడుతూ మానసిక వికలాంగులు, మానసిక రుగ్మత ఉన్న వారిని చిన్నచూపు చూడకూడదన్నారు. వారి పట్ల స్నేహ దృక్పథంతో ఉండాలని తెలిపారు. వారికి లీగల్ సర్వీసెస్ ద్వారా రక్షణ, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎవరైనా మానసికంగా బాధపడుతున్నా, మానసిక రుగ్మతతో ఉన్నా వారికి ఎటువంటి సహాయం కావాలన్నా, జగ్గయ్యపేటలో ఉన్న మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాల్సిందిగా కోరారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో వేడి నీటిని తాగాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, ట్రెజరర్ మెట్టెల ఆంజనేయులు, న్యాయవాదులు దాసరి నాగేశ్వరరావు, ఎం.విజయకుమారి, మన్నెం మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

కంచికచర్ల : ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సాస్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత ఈ కర్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రజా వేదికలో ఉపాధి హామీ పనుల ద్వారా భవనాలు, రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డ్రెయిన్లు పింఛన్లపై పనుల తీరును వేతనాలు చెల్లింపులపై నివేదికలు సమర్పించారు. మండలంలో 1,587 పనులకు రూ.8 కోట్లు ఖర్చు చేశారు. తనిఖీలు నిర్వహించగా మండలంలోని పరిటాలలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన వారికి మస్టర్ వేశారని రూ.18 వేలు దుర్వినియోగం చేసినందున సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించి ఆ నగదును రికవరీ చేయాలని పీడీ సునీత సిబ్బందిని ఆదేశించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రోడ్ల వెంబడి మొక్కలు నాటారని, ఆ మొక్కల నిర్వహణలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. ఉపాధిహామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ప్రాజెక్టు డైరెక్టర్ సునీత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి నాగిరెడ్డి, ఇన్చార్జి ఎంపీడీఓ కే బాలశంకరరావు, సామాజిక తనిఖీ అధికారి సూర్యనారాయణ, సోషల్ ఆడిట్ డీఆర్‌పీలు, ఉపాధిహామీ పథకం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.